సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నర్సాపూర్, నవంబర్ 19 : బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కొన్యాల గ్రామానికి చెందిన భూదయ్యకు రూ.31,500, మనోహరాబాద్‌కు చెందిన ఎస్. శ్రీనివాస్‌కు రూ.60 వేలు, పోతారం గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాస్‌కు రూ.13 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో లబ్ధిచేకూరుతుందని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు జగ్గంపేట నర్సింహులు, అనంతరావు, మాధవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రజా పాలన కళాయాత్ర ప్రారంభం

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాహుల్ రాజ్

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ప్రజా పాలన కళాయాత్ర సమాచార, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో సిద్ధం చేయగా, కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ప్రజా విజయోత్సవాలు ఈ నెల 19 నుంచి డిసెంబర్ 7 వరకు జిల్లాలోని మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలు, 21 మండలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రచారం చేయనున్నారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో, ప్రతి మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కళాయాత్ర మెదక్ జిల్లాలో ప్రారంభించనన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కే రామచంద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీసీ డీఎం సంబంధిత తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

అదనపు కలెక్టర్ నగేశ్ గౌడ్

నర్సాపూర్, నవంబర్ 19 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గూడెంగడ్డ గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్మానించడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి గ్రామంలోని వీధుల గుండా తిరుగుతూ మరుగుదొడ్ల ఉపయోగాన్ని, పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

నగదును బహూకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్‌గౌడ్

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సమావేశంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన అధికారులను, గ్రామస్తులను ఆకట్టుకుంది. చిన్నారులకు బహుమతిగా అదనపు కలెక్టర్ సూచనల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ ఆరుగురు చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదును బహూకరించారు. నగదు అందజేయడంతో చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో మధులత, ఏపీఎం గౌరీశంఖర్, పంచాయతీ కార్యదర్శులు నగేశ్, తారాసింగ్, హెచ్ఎం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

నిజాంపేట, నవంబర్ 19 : మండలంలోని రాంపూర్‌లో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధాన వీధుల వెంబడి ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రహాస్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, చంద్రకాంత్, కుమారస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో నిందితుడికి ఏడేండ్ల జైలు

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 19 : బాలికను శారీరకంగా హింసించిన మేనమామకు ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20వేల జరిమానాను మంగళవారం జిల్లా ప్రధానా న్యాయమూర్తి లక్ష్మీశారద విధించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ అమ్మాయికి తల్లి లేకపోతే తండ్రి మరో వివాహం చేసుకోగా, వాళ్ల అమ్మమ్మతో పాటు మామయ్య కూడా ఉంటున్నాడని తెలిపారు. బాలికను శారీరకంగా తాకుతూ, అప్పుడప్పుడు కొన్ని అశ్లీల వీడియోలు చూపించేవాడు. అమ్మమ్మకి కానీ వేరే వాళ్లకు కానీ చెప్తే చంపేస్తా అని బెదిరించేవాడని పేర్కొన్నారు. చిన్నారి స్కూల్ నుంచి ఇంటికి వెళ్లడానికి కూడా భయపడేది. అమ్మ వాళ్లు వచ్చి ఏమైందని అడిగితే భయపడుతూ ఈ విషయాన్ని చిన్నారి చెప్పింది. మా మామయ్య ఒగ్గు శ్రీనివాస్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా, మెదక్ పట్టణ పోలీస్ వారు కేసు నమోదు చేసుకొని సాక్ష్యాధారాలను కోర్టుకి నివేదించినట్లు తెలిపారు. పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడైన ఒగ్గు శ్రీనివాస్‌కి ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానాను విధించినట్లు తెలిపారు. నిందితునికి శిక్షపడే విధంగా వాదనలు వినిపించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పెషల్ ట్రైల్ ఫోక్సో రాజ్‌కుమార్, ఇన్వెస్టిగేషన్ అధికారి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌లను ఎస్పీ అభినందించారు.

సఖీతో మహిళలకు భరోసా

మెదక్ రూరల్, నవంబర్ 19 : మహిళలు, బాలికలు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్నారని అలాంటి బాధిత మహిళలకు మేమున్నామంటూ సఖీ కేంద్రాలు భరోసా ఇస్తున్నయని అడిషనల్ ఎస్పీ మహేందర్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని సఖీ కేంద్రంలో మైచాయిస్ ఫౌండేషన్, సఖీ కేంద్ర ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు మానవ అక్రమ రవాణాపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖీ కేంద్రం ద్వారా బాధితులకు తాత్కాలిక వసతి కల్పించడంతో పాటు ఉచిత న్యాయసహాయం, వైద్యసేవలు,పోలీస్ సాయం, కౌన్సెలింగ్, అందిస్తున్నామన్నారు. ఇట్టి సేవలపై ప్రజలకు అవగాహన, చైతన్యం కలిగిస్తుందన్నారు. ఆపదలో ఉన్న మహిళాలు చిన్నారులను ఆదుకోవడానికి వాహనం కూడా అందుబాటులో ఉంటుందని అన్నారు. ఎవరికైనా ఆపద వచ్చినా, హెల్ప్ లైన్ 100, 1098, టోల్ ఫ్రీ నెంబర్ 181 ,1800 4198588పోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ మహేందర్

ఎన్ఎల్ఎం స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగదేవ్‌పూర్, నవంబర్ 19: కేంద్రం ప్రవేశపెడుతున్న ఎన్ఎల్ఎం(నేషనల్ లైవ్ స్టాక్ మిషన్) స్కీమ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని దౌలాపూర్, ధర్మారం గ్రామాల్లో ఇద్దరు రైతులకు ఎన్ఎల్ఎం స్టాక్ మిషన్ పథకం ద్వారా మంజూరైన షెడ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్కీమ్ ద్వారా గడ్డి పెంపకం, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం చేపట్టుకోవచ్చన్నారు. ఈ నెల 26 నుంచి పశుగణన ప్రారంభమై వచ్చే నెల 9వరకు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అడిషినల్ డైరెక్టర్ రమేశ్, మండల పశుసంవర్ధకశాఖ అధికారి శ్వేత పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

రామాయంపేట, నవంబర్ 19 : రామాయంపేట పట్టణంలోని సామాజిక కుటుంబ సర్వే జోరుగా కొనసాగుతున్నది. మంగళవారం పట్టణంలోని ఆరో వార్డులో ఎన్యూమరేటర్ మోబీన్, వార్డు కౌన్సిలర్ దేమె యాదగిరి ఇంటంటికీ తిరిగి కులగణన చేపడుతున్నారు.ప్రభుత్వం చేపడుతున్న కులగణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ యాదగిరి పేర్కొన్నారు.

మా ఆస్తులు మీకెందుకు చెప్తాం..

చిలిపిచెడ్, నవంబర్ 19 : మా ఆస్తులు, అప్పులు మీకెందుకు చెప్తాం.. మీరేం మా అప్పులు తీర్చేటోల్లా.. ఆర్చేటోల్లా అని గ్రామస్తులు మండలంలోని పలు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లకు సమాధానం చెప్తున్నారు. దీంతో వారు చేసేదేమిలేక చెప్పింది రాసుకొని మరో ఇంటికి వెళ్లున్నారు. సర్వేలో గ్రామస్తులు చాలా వరకు తమకున్న అస్తుల వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. కొందరైతే తమకు ఇల్లులేదని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలని కోరుతున్నారు. మరి కొందరు తమకు పింఛన్ రావడంలేదని అడుగుతున్నారు. అనంతరం ఎంపీడీవో ఆనంద్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని తప్పులు లేకుండా పూర్తి వివరాలు సేకరించి సర్వే చేయాలని సూచించారు. సర్వేను నిర్ల క్ష్యం చేస్తూ చర్యలు తప్పవన్నారు. కార్యదర్శులు తిరుపతి, జితేందర్, నాగరాజు, అనంద్ పాల్గొన్నారు.

చిలిపిచెడ్: చిట్కుల్‌లో సర్వే చేస్తున్న అధికారులుః

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

చిలిపిచెడ్, నవంబర్ 19 : చిలిపిచెడ్ మండలంలో ధాన్యం కొనుగోలు కొనసాగుతున్నాయి. మండలంలోని సోమక్కపేట పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్లలో వెంట వెంటనే లారీలో తరలించాలని రైతులు సూచించారు. అనంతరం సోమక్కపేట పీఏసీఎస్ సీఈవో పోచయ్య మాట్లాడుతూ పీఏసీఎస్ పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ఏ రైతుకు ఇబ్బంది లేకుండా ప్రతి ధాన్యం గిజనూ కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని సీఈవో పోచయ్య సూచించారు. ధాన్యం తరలించిన రైతులు తమ పట్టాపాసుపుస్తకం, ఆధార్‌కార్డు, అకౌంట్ బుక్ జిరాక్స్‌లు తమ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఇవ్వాలని తెలిపారు.

చండూర్‌లో లారీలో ధాన్నాన్ని లోడ్ చేస్తున్న కూలీలు

బీఆర్ఎస్ భయంతోనే కొనుగోళ్లు వేగవంతం

శివ్వంపేట, నవంబర్ 19 : జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ భయంతోనే ధాన్యం కొనుగోళ్లలను అధికారులు వేగం పెంచారని నర్సాపూర్ ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి సన్నవడ్లను కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురా లు పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో పాదయాత్ర నిర్వహించేందుకు సిద్ధమవడంతో అధికారులు ఉలిక్కిపడి ప్రతీ సెంటర్ తిరిగి సన్నవడ్లు తీసుకోవడం ప్రారంభించారన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో రైతుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే వారి పక్షాన బీఆర్ఎస్ ముందుండి పోరాడి ప్రజల పక్షాన నిలుస్తున్నదని తెలిపారు.

ఆత్మకమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

టేక్మాల్, నవంబర్ 19 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా వ్యవసాయ సహకార సంఘం అధికారి కరుణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. అక్కడ ఉన్న రైతులతో ఆమె మాట్లాడారు. ఆరబోసిన వడ్లను ఆమె పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులను ఆ దేశించారు. సొసైటీకి సంబంధించి ఖాళీగా ఉన్న షెటర్లను అవసరమైన వారికి అద్దెకు ఇవ్వాలన్నారు. ఆమె వెంట డీసీఏవో కరుణాకర్, నిర్వాహకులు సాయిలు ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి కరుణ

గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

చిన్నశంకరంపేట, నవంబర్19 : మండలంలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందించాలని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాచారాన్ని అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించాలని సూచించారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టకూడదని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియన వ్యక్తులు తమకు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలను అడిగితే ఎట్టి పరిస్థితిలో చెప్పవద్దన్నారు. తమ వ్యక్తిగత వివరాలను అందించి మోసపోవద్దని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సిద్దిపేట టౌన్, నవంబర్ 19 : చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం చాలా గొప్పది. విద్యార్థులు రాజ్యాంగాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 19 : పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో రమాదేవి హాజరై మాట్లాడుతూ ఈనాడు మహిళలు ప్రతి రంగాల్లో రాణిస్తున్నారన్నారు. నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హంసీబాయి, గ్రంథాలయ సిబ్బంది నరేందర్‌రెడ్డి, యాదగిరి, శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీని పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సహాసినిరెడ్డి

రేపు చెకుముకి సైన్స్ పరీక్ష

చేర్యాల, నవంబర్ 19: ఉన్నత స్థాయి విద్యార్థులకు సైన్స్‌పట్ల అవగాహన కల్పించేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబురాలు-2024 పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయిలో జరిగిన పరీక్షలో 8, 9, 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి పరీక్షకు సన్నద్ధం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠాపన

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 19 : జిల్లా కేంద్రం మెదక్‌లోని ద్వారకనగర్ కాలానీలో ఈనెల 21న అభయ అంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవారం ద్వారకనగర్ కాలానీ వాసులు ప్రభురెడ్డి, సునీల్, సురేందర్‌తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందం గా అలంకరించారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెంచడమే లక్ష్యం

జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

వెల్దుర్తి, నవంబర్ 19 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను పెంచడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్ల కింద ప్రభుత్వ దవాఖానల్లో అధికంగా ప్రసవాలు జరిగేవని, కాని ప్రస్తుతం తగ్గాయన్నారు. గతంలో మాదిరిగానే అత్యధికంగా ప్రసవాలు జరిగేలా దవాఖానలను, ఆపరేషన్ థియేటర్‌లను ఆధునీకరించడంతో పాటు అన్ని రకాల పరీక్షలను నిర్వహించడం, అత్యవసర మందులైన పాముకాటు, కుక్క కాటు మందులను అందుబాటులో ఉంచామన్నారు. టీబీ కార్యక్రమం సైతం ప్రారంభమైందని, జిల్లాలో రెండు లక్షల మందికి, వారికి గ్రామాల వారీగా వ్యాక్సినేషన్ వేశామన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రం పేరుతో ప్రథమ చికిత్సను మాత్రమే అందించాలని, అంతకుమించి ఇతర చికిత్సలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కేంద్రాలను సీజ్ చేయనున్నామని తెలిపారు.

వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానలో మందులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి శ్రీరామ్

వరి కొయ్యలను కాల్చొద్దు

నిజాంపేట, నవంబర్ 19 : వరి కోతల అనంతరం వరి కొయ్యల అవశేషాలను ఎట్టి పరిస్థితుల్లో కాల్చకూడదని మండల ఏవో సోమలింగారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం నస్కల్‌లో వరి కొయ్యలను కాల్చిన వ్యవసాయ పంట పొలాలను ఏవో సోమలింగారెడ్డి సందర్శించి, రైతులతో మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలో పంటలకు సహకరించే సూక్ష్మజీవులు మృతి చెంది పొలాలు నిస్సారంగా మారి దిగుబడులు తగ్గుతాయన్నారు. ఏఈవో శ్రీలత, రైతులు ఉన్నారు.

ములుగులో..

ములుగు, నవంబర్ 19 : వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి ప్రగతి అన్నారు. మంగళవారం ములుగులోని రైతులకు వరికొయ్యలను కాల్చివేయడం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఆమె వెంట ఏఈవో పృథ్వీ, రైతులు ఉన్నారు.

రైతులకు సూచనలిస్తున్న మండల ఏవో సోమలింగారెడ్డి

సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 19 : 15 రోజుల్లో సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, లేని యెడల నిరవధిక సమ్మెకు వెళ్తామని టీఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌కు సమ్మె నోటీస్‌ను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి 13 అక్టోబర్ 2024న హన్మకొండలో వేదికగా ఎస్ఎస్ఏ సమ్మె శిబిరానికి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లో సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. విధి నిర్వహణలో సమగ్రశిక్షా ఉద్యోగులు 126 మంది ప్రాణాలు కోల్పోయిన ప్పటికీ ప్రభుత్వ స్పందించక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్ఎస్‌యూఎస్ నాయకులు అనిల్‌చారి, సత్యనారాయణ, అమృత, గట్టయ్యా, శ్రీకాంత్, కనకరాజు, అంజనేయులు, మహేశ్ పాల్గొన్నారు.



డీఈవోకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

ఆర్ట్ పోటీల్లో వెల్దుర్తి విద్యార్థుల ప్రతిభ

వెల్దుర్తి, నవంబర్ 19 : రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబై కొన్ని రోజుల కింద నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్ట్ పోటీల్లో మండల కేంద్రమైన వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి పతకాలను సాధించారు. ఆర్ట్ పోటీల్లో పాఠశాల నుంచి మొత్తం 35 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 8 మంది బంగారు, 5 మంది సిల్వర్, 5 మంది బ్రాంజ్ మెడల్స్‌ను సాధించినట్లు హెచ్ఎం సాంబయ్య తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులతో పాటు వారిని తీర్చిదిద్దిన అధ్యాపకురాలు జయసుధను హెచ్ఎం, అధ్యాపకులు అభినందించారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

విద్యార్థులకు భాషా నైపుణ్యాన్ని పెంచాలి

మెదక్ రూరల్, నవంబర్19 : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి నీలకంఠం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని, శివాయిపల్లి, గుట్టకింది పల్లి ఆయా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో, అబ్జర్ వైజర్ మహేశ్ రెడ్డి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థాలను పరిశీలించి బోధన చేశారు. పాఠశాలల్లోని పరిసరాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట కార్మికులకు తగు సూచనలు చేశారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీస్తున్న ఎంఈవో

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 19: ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల రైతులు అధిక ఆదాయం పొందవచ్చని గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబునాయక్ అన్నారు. మంగళవారం కొండపాక మండల కేంద్రంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంటను ఆయన సందర్శించారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సాగుచేస్తున్న వేరుశనగ, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలు ఒకసారి నాటితే 30 ఏండ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ, ఏఈవోలు మౌనిక, సంధ్య, రైతులు పాల్గొన్నారు.

కొండపాకలో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాబునాయక్

పరిష్కారానికి ఫిర్యాదుల పెట్టె

పాపన్నపేట, నవంబర్ 19 : రైతు సమస్యల పరిష్కరానికి ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్ తెలిపారు. 71వ సహకార సంఘ వారోత్సవాల సందర్భంగా మంగళవారం సొసైటీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్లు ,జిల్లా కో- ఆపరేటివ్ అధికారులు, రిటైర్డ్ సొసైటీ ఉద్యోగులు తదితరులతో సమన్యయ సంఘ సమవేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ కార్యాలయంలో రైతు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి ,15 రోజులకు ఒక సారి ,ఇద్దరు డైరెక్టర్లు , సొసైటీ అధికారుల సమక్షంలో తెరుస్తామని చెప్పారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వెల్లడించారు. ఎండీలు గోపాల్ రావు, విశ్వనాథం, ఎల్‌వీఎస